క్లుప్తంగా

కంపెనీ స్థాయి చెస్ పోటీల్లో విజేత 'కొత్తగూడెం'

సింగరేణి(కొత్తగూడెం): భూపాలపెల్లిలో జరుగుతున్న సింగరేణి కంపెనీ స్థాయి చెస్ పోటీలలో కొత్తగూడెం కార్పొరేట్ ఉద్యోగులు విజేతలుగా నిలిచారు. కార్పొరేట్ ఏరియా సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న శివకుమార్, కే.లక్ష్మణ్‌రెడ్డి కోలిండియా పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా స్టాండ్ బైగా మడిపెల్లి శ్రీనివాస్ నిలిచారు. వీరిని భూపాలపెల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వరరెడ్డి బుధవారం అభినందించారు.

నేడు జిల్లా స్థాయి చెకుముకి సంబురాలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా స్థాయి చెకుముకి సంబురాలు గురువారం కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్‌లోని సింగరేణి హైస్కూల్ వేదికగా జరుగుతాయని రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని తెలిపారు. విజేతలు వారి ప్రధానోపాధ్యాయులతో ధృవీకరణ పత్రం, ఆధార్ నంబరు తీసుకొని రావాలని చెప్పారు. విద్యార్థులను గవర్నమెంట్ ఇంగ్లిష మీడియం, ప్రైవేటు ఇంగ్లిష మీడియం, రెసిడెన్షియల్ ఇంగ్లిష మీడియం, అన్ని యాజమాన్యాల తెలుగు మీడియం నాలుగు కేటగిరీలుగా పరిగణిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు వీరభద్రం, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సర్వే విధులు కేటాయించొద్దు


హరిలాల్‌నాయక్

టేకులపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల సర్వే విధులను బాధ్యతాయుతంగా, పట్టుదలతో, కష్టపడి నిర్ణయించిన సమయంలోనే పూర్తి చేసిన ఉపాధ్యాయులను మళ్లీ ఆ ఫారాలు ఆన్‌లైన్ చేసే విధులలో పాల్గొనాలపడం సరైంది కాదని, దానిని విరమించుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు గుగులోత్ హరిలాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 6వ తేదీ నుంచి ఉపాధ్యాయులు ఒక పూట పాఠశాల విధులకు హాజరై మధ్యాహ్నం సర్వే విధులు నిర్వహిస్తే అనేక పాఠశాలలు ఒక పూట మూతపడడంతో, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలపై తల్లిదండ్రులు అసంతృప్తితో ఉంటున్నారని తెలిపారు. అసలే ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు తగ్గుతుండడంతో ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం అవుతున్న తరుణంలో ఈ విధంగా ఉపాధ్యాయులను విద్యా బోధనకు దూరం చేయడం వల్ల ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో వ్యతిరేకత పెరుగుతుందన్నారు. సెలవు రోజుల్లో సర్వే నిర్వహించిన ఎన్యుమరేటర్స్‌కు సీసీఎల్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

బాధ్యతలు చేపట్టిన ఉపేందర్‌రావు


కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న ఉపేందర్‌రావు

కొత్తగూడెంరూరల్: షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం సంస్థ జిల్లా (ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్)గా రాగి ఉపేందర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

టేకులపల్లి: సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఆధ్వర్యంలో టేకులపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకులం, ఏకలవ్య పాఠశాలల్లో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి చికిత్స అందించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఈ చలికాలంలో జలుబు, ఫ్లూ, దగ్గు, సైనసైటిస్, బ్రాంకైటిస్, ఆస్తమా వంటి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వైరస్ ద్వారా వచ్చే ఫ్లూ, జలుబు దగ్గు, జ్వరం చాలావేగంగా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తాయి కాబట్టి వ్యాధి లక్షణాలు ఉన్న పిల్లలు మాస్క్ ధరించాలని, చేతులు శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలని, చలిగాలుల నుంచి రక్షణ పొందడానికి ఉన్ని దుస్తులు ధరించాలన్నారు. నిండుగా బట్టలు ధరించాలని, కూల్ డ్రింక్స్, చల్లటి నీరు, చల్లటి, తీపి పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. శరీరంలో వేడి పెరగడానికి క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, సరిపడా నీరు తాగాలని, వ్యాధి నిరోధక శక్తి పెరగడానికి విటమిన్ సి ఎక్కువగా లభ్యమయ్యే సిట్రస్ జాతి పండ్లను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండీ సుమయ, ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, స్టాఫ్ నర్స్‌లు ఎండీ రేష్మ, తార, ఏఎన్‌ఎంలు స్వప్న, సులోచన, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

'పది' పాస్.. నో విజిలెన్స్ ఎంక్వైరీ

కొత్త సర్క్యులర్ జారీ చేసిన సింగరేణి యాజమాన్యం


భూగర్భ గనిలోకి వెళ్తున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గతంలో వేలిముద్ర వేస్తే చాలు సింగరేణిలో ఫ్లోటింగ్ బదిలీ పిల్లర్ (నేడు బదిలీ వర్కర్) ఇచ్చేవారు. కానీ తాజాగా తండ్రి ఉద్యోగం కొడుకుకు ఇవ్వాలంటే పది పాస్ అయితే విజిలెన్స్ విచారణ ఉండదని, నేరుగా ఇంటర్వ్యూకు వెళ్లవచ్చని, చదువుకోని వారు మాత్రం కచ్చితంగా విజిలెన్స్ విచారణ పూర్తి అయిన తరువాతే సింగరేణి ఉద్యోగం అంటూ సింగరేణి యాజమాన్యం తాజాగా ఈనెల 6న సర్క్యులర్ జారీ చేసింది.

సంస్థలో చదువుతో సంబంధం లేకుండా ఇచ్చే ఉద్యోగాలు చాలా ఉన్నాయి. అయితే సంస్థలో సాంకేతిక ఉద్యోగాలకు తప్ప మిగతా కొన్ని విభాగాలకు చదువు అవసరం లేదు. చదువుకోక పోయినా ఈ పనులు చేయవచ్చు. కానీ, ఇటీవల డిపెండెంట్ ఉద్యోగాలలో డిగ్రీ, పీజీ చదువుకున్నవారు అధికంగా ఉద్యోగాల్లో చేరుతున్నారు.

విచారణకు వెళ్తే ఉద్యోగం అవుట్...

ఏ ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఉద్యోగంలో చేరిన తరువాత ఆరు మాసాల్లో విజిలెన్స్ విచారణ చేసి, వారు ఏమైనా జ్యుడీషియల్ కేసులు ఇతరత్రా అల్లర్లకు సంబంధించిన పోలీసు కేసులు ఉన్నాయా అని విచారణ చేసి వారిని ఉద్యోగంలో రెగ్యులర్ చేస్తారు.

కానీ సింగరేణిలో మాత్రం డిపెండెంట్ ఉద్యోగంలో చేరాలంటే వెల్ఫేర్, ఐఆర్‌పీఎం వారు చేయాల్సిన విచారణను విజిలెన్స్ మీద నెట్టేయడానికి ఈ రెండు విభాగాల అధికారులు విజిలెన్స్‌కు పంపించి అనేక ఉద్యోగాలను పెండింగ్‌లో పెట్టి వారి జీవితాలతో ఆడుకుంటున్నారని సింగరేణి వ్యాప్తంగా ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. సింగరేణి సంస్థలో గతంలో కొంతమంది మారుపేరు మీద ఉద్యోగంలో చేరారు. విషయం తెలిసినా యాజమాన్యం ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా ఉద్యోగంలో అవకాశం కల్పించారు. అయితే వారి సర్వీసు పూర్తయిన తరువాత వారి ఉద్యోగం కుమారుడికి ఇచ్చే క్రమంలో వారు మారు పేర్ల మీద ఉద్యోగంలో చేరారని, కుమారుడికి ఇచ్చే ఉద్యోగంలో కొర్రీలు పెట్టి నిలిపి వేయడం సరైంది కాదని, ఇటీవల హైకోర్టు తీర్పు కూడా ఇచ్చింది. అయినప్పటికీ యాజమాన్యం పదోతరగతి చదువుకున్న వారికి విజిలెన్స్ విచారణ లేకుండా.. కేవలం చదువు కోని వారి పట్ల సవతి తల్లి ప్రేమ కనబరుస్తూ వారి ఉద్యోగాలను నిలిపి వేయడం తగదని కార్మికులు వాతున్నారు.

గుర్తింపు సంఘం ఏం చేస్తున్నట్లు...



సింగరేణి కార్మికుల సమస్యలపై నిత్యం పోరాడుతామని, తమ యూనియన్‌కు అపార అనుభవం ఉందని ప్రగల్భాలు చెబుతున్న గుర్తింపు సంఘం నాయకులు కార్మికుల ఉద్యోగాలను అడ్డుకునే విధంగా ఉన్న ఈ సర్క్యులర్‌ను నిలిపి వేయించకపోవటం సరైందికాదు. యాజమాన్యం, కొన్ని యూనియన్‌లతో మిలాకత్ అయ్యి కార్మికుల ఉద్యోగాలకు ఎసరు పెడుతోంది. అంతేకాకుండా గతంలో ఎన్నడూ లేని విధంగా పదో తరగతి పాస్ అయితే విజిలెన్స్ విచారణ ఉండదని పేర్కొనటం విడ్డూరం. – రియాజ్ అహ్మద్

ఆంక్షలు లేకుండా ఉద్యోగం ఇవ్వాలి



గతంలో రన్నింగ్‌లో ద్వారా ఉద్యోగంలో చేరినవారు సింగరేణిలో వేలాది మంది ఉన్నారు. వారు జీవితకాలం సంస్థకు సేవలు చేసి, గాలి, నీరు లేక గులాయిలో ప్రాణాలను పణంగా పెట్టి రూ.కోట్ల లాభాలు చేకూర్చి, సుదీర్ఘకాలం పనిచేసిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వటంలో యాజమాన్యం కొర్రాలు పెట్టటం సరికాదు. సర్వీసు వదిలిపెట్టి కొడుకుకు ఉద్యోగం వస్తుందని ఆశతో మెడికల్ ఇన్‌వాలిడ్ అయిన కుమారులకు బేషరతుగా ఉద్యోగం ఇవ్వాలి. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలే అధికం. – అంతోటి నాగేశ్వరరావు

బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించండి..


ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని సులబ్ కార్మికులకు బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ తదితర చట్టబద్ధ హక్కులు కల్పించాలని కోరుతూ భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, జీఎం పర్సనల్ (ఐఆర్ పీఎం)కు వినతిపత్రం అందజేశారు. ఇఫ్టూ జాతీయ కార్యదర్శి టి. శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ఏ.వెంకన్న మాట్లాడుతూ... సింగరేణి వ్యాప్తంగా 220 సులభ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయని, ఇందులో పనిచేసే కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య భద్రత కోసం సులభ్ సంస్థవారు కార్మికులకు కనీస సౌకర్యాలు అందించడం లేదని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులను దోపిడీ చేస్తున్న సులభ్ సంస్థకు టెండర్లు ఇవ్వొద్దని, ఇచ్చిన వాటిని రద్దు చేయాలని కోరారు. గౌని నాగేశ్వరరావు, మోత్కూరి మల్లికార్జున్‌రావు, నెమిళ్ల సంజీవ్, ఎండీ జాఫర్, టి. శ్రీనివాస్, శ్రీకాంత్, అరుణ, లక్ష్మి, మీనా, వెంకట్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ ఉండాలి


పరీక్షలు చేయించుకుంటున్న డీఎస్పీ సతీష్‌కుమార్

పాల్వంచ: పోలీసు అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో సబ్ డివిజన్‌లో పనిచేసే అధికారులు, సిబ్బందికి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. నిత్యం శాంతి భద్రతల పరిరక్షణతో పాటు, ప్రజలకు సేవలందిస్తూ పోలీసులు విశ్రాంతి లేని జీవితాన్ని గడపాల్సి వస్తుందన్నారు. చాలా సందర్భాల్లో నిద్రాహారాలు మాని విధులు నిర్వహిస్తుంటారని చెప్పారు. ఈ కారణంగా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. పోలీసులు అప్పుడప్పుడు కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి సరిగా లేనప్పుడు కూడా తప్పనిసరిగా విధులు నిర్వహించాల్సి వస్తుందన్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో పోలీస్ సిబ్బంది పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తమ దృష్టి వచ్చిందని, వారి కోసం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాల్వంచ, అశ్వారావుపేట సీఐలు వినయ్ కుమార్, కరుణాకర్, ఎస్ఐలు సుమన్, సురేష్, రాజశేఖర్, రాజేష్, యయతి రాజు, జీవన్ రాజు, వైద్యులు ముక్కంటేశ్వరరావు, యుగంధర్‌రెడ్డి, కోరాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో సమస్యలు పరిష్కరించండి..

టేకులపల్లి: సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. సింగరేణి గిరిజన ఉద్యోగుల, ప్రమోషన్లు, సర్వీస్, వ్యక్తిగత సమస్యల మీద నిరంతరం సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హక్కుల సాధన కోసం పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే చాలాకాలం నుంచి మిగిలిపోయిన సమస్యల మీద సోమవారం ఢిల్లీలోని నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్ ఆఫీసులో, కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ అధ్యక్షతన సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం సమక్షంలో యాజమాన్యం తరఫున జనరల్ మేనేజర్ శ్రీనివాస్, అసోసియేషన్ సభ్యులు, అధ్యక్షులు ఆంగోత్ భాస్కర రావు , జనరల్ సెక్రెటరీ భూక్య నాగేశ్వరరావు , వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ పంతుల , సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మోకాళ్ల తిరుమల్రావు రివ్యూలో పాల్గొని గిరిజన ఉద్యోగుల మరియు సింగరేణి ప్రభావిత ప్రాంతాల గురించి మాట్లాడటం జరిగిందని తెలిపారు. జీఓ 5 ప్రకారం అధికారుల పదోన్నతులలో రిజర్వేషన్ అమలు, జీఓ 259 ప్రకారం అధికారుల పోస్టుల గురించి, 11 ఏరియాలో ఉన్న గిరిజన ఉద్యోగుల నుంచి అప్లికేషన్స్ స్వీకరించి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి ప్రమోషన్లు ఇవ్వాలని, సింగరేణి పరిసర ప్రాంత మరియు షెడ్యూల్డ్ ఏరియాలో ఐటీఐ పూర్తి చేసి అప్రెంటిస్‌షిప్ కోసం ఎదురుచూస్తున్న పిల్లలకు వన్ టైం సెటిల్‌మెంట్ కింద అందరికీ అవకాశం ఇవ్వాలని, సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు కమిషన్ దృష్టికి తీసుకొచ్చిన విషయాలను పరిశీలించి 15 రోజుల్లోపు సమస్యల పరిష్కారానికి యాక్షన్ టేకెన్ రిపోర్టును నేషనల్ కమిషన్ చైర్మన్‌కు, మెంబర్ మరియు అసోసియేషన్ సభ్యులకు పంపించవలసిందిగా నేషనల్ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్ సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

సేవా అధ్యక్షురాలికి సన్మానం


నిమ్మి ఆనంద్‌ను సన్మానిస్తున్న సమితి సభ్యులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్‌ను సేవా సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. జేకే సీఈఆర్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిమ్మి ఆనంద్ మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చేందుకు, స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడేందుకు ప్రోత్సాహం అందించారని తెలిపారు. టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సులలో నూతన మిషనరీ, ముడి సరుకులను వారికి సకాలంలో అందించి సుమారు 175 మందికి శిక్షణ అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్, సేవా జాయింట్ సెక్రెటరీ సులక్షణ, సభ్యులు, ట్రైనర్లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సింగరేణి ఏరియా జీఎం జాన్ ఆనంద్‌ను సింగరేణి స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాఠశాలలో ఘనంగా సత్కరించారు. పాఠశాలలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత జీఎం జాన్‌ఆనంద్‌కు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జీవీ మోహన్‌రావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ధనలక్ష్మి, జ్యోత్స్న, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు చేయండి..

జూలూరుపాడు: మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు బుధవారం మండల పరిషత్ సూపరింటెండెంట్ తాళ్లూరి రవికి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... గ్రంథాలయం యువత, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంచుకోవడంతోపాటు, పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యే అవకాశం ఉంటుందని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ఆటో వర్కర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీని స్థానిక శేషగిరి భవన్‌లో బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా అనిల్ (అశ్వారావుపేట), ప్రధాన కార్యదర్శిగా మద్రి కృష్ణ (కొత్తగూడెం), ఉపాధ్యక్షుడిగా బడుగు భాస్కర్, విజ్జి, ఆరెల్లి కృష్ణ, పుట్ట లక్ష్మణ్, ముక్కెర లక్ష్మణ్, సహాయ కార్యదర్శులుగా జోసెఫ్, బాబు జానీఖాన్, షాకీర్, అక్బర్ హుస్సేన్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కోటేశ్వరరావు, శివ, ఎస్ జనార్ధన్, వీర్ల దుర్గ, జలీల్‌లను ఎన్నుకున్నట్లు జమలయ్య తెలిపారు. వీరితోపాటు 47 మంది కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు. ఆటో కార్మికుల సమస్యలపై నూతన కమిటీ స్పందించి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో మల్లికార్జున్, బాతుల సత్యనారాయణ పాల్గొన్నారు.

బ్లాక్ డైమండ్‌గా పేరు మార్పు

ఇల్లెందు: పట్టణంలోని జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌ను బ్లాక్ డైమండ్ స్టేడియంగా పేరు మార్చారు. ఈ సందర్భంగా బుధవారం జీఎం జాన్‌ఆనంద్ మాట్లాడుతూ.. స్టేడియాన్ని సుందరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. వాకింగ్ ట్రాక్, ఫ్లడ్ లైట్లు, స్టేజీ, మరుగు దొడ్లు, బాస్కెట్ బాల్ గ్రౌండ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం బి.వెంకటేశ్వర్లు, ఓఎస్డీ ఈసం కృష్ణయ్య, జీవీ మోహన్‌రావు, ఇతర అధికారులు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటనీ అతిథి అధ్యాపక పోస్టు ఖాళీగా ఉందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హెచ్.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాస్టర్ ఆఫ్ సైన్స్ బోటనీలో 50 శాతం మార్కులు ఉండి ఆసక్తి కలిగిన డిసెంబర్ 4వ తేదీ లోపు తమ దరఖాస్తులను జిల్లా ఇంటర్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

కోరం లక్ష్మికి పరామర్శ

ఇల్లెందు: ఇల్లెందు ఎమ్మెల్యే శ్రీ కోరం కనకయ్య సతీమణి లక్ష్మి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతోంది. ఈ మేరకు ఆమెను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పులిగండ్ల మాధవరావు, చల్లా శ్రీనివాసరావు, జనగాం కోటేశ్వరరావు, నున్న రామకృష్ణ, ములుగునూరి రమేష్ గౌడ్ ఆమెను పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సమాజ సంక్షేమానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కొత్తగూడెంరూరల్: రెడ్లు ఐక్యంగా సమాజంలోని అన్నివర్గాల, కులాల ప్రజలకు బంధువులుగా, ప్రజాసంక్షమమే ధ్యేయంగా ముందుకెళ్లాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కొత్తగూడెంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డులో గల సెంట్రల్ పార్క్‌లో కొత్తగూడెం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజన మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి శ్రీనివాసరెడ్డికి రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు ఘనస్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ.. రెడ్లు సమాజం కోసం చేసిన త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సంఘం గౌరవ అధ్యక్షులు లేళ్ల వెంకటరెడ్డి, మైరెడ్డి జనార్దన్‌రెడ్డి, పారెడ్డి గోపాల్‌రెడ్డి, కొడగండ్ల వెంకటరెడ్డి, ముప్పాని సోమిరెడ్డి, వజ్రాల జమలారెడ్డి, వై.శ్రీనివాసరెడ్డి, జవహర్‌రెడ్డి, కాసాని శ్రీనివాసరెడ్డి, పైడిమర్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మంత్రికి ట్రైబల్ టీచర్ల వినతి

ఇల్లెందు: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ట్రైబల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. బుధవారం కొత్తగూడెంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూకర రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంపీ నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు, హిందీ, పీఈటీగా విధులు నిర్వహిస్తున్న ఐటీడీఏ ఉపాధ్యాయులకు సుమారుగా 375 మందికి ఇప్పటి వరకు అప్‌గ్రేడ్ చేయలేదని, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ పరిధిలో ఉపాధ్యాయులకు అప్‌గ్రేడ్ చేశారని తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఉపాధ్యాయులకు అప్‌గ్రేడ్ చేసి న్యాయం చేయాలని కోరారు. కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ కల్పించాలని, వారికి రావాలిన్న పెండింగ్ జీతాలు విడుదల చేయాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఏఎన్‌ఎంలకు ఎనిమిది నెలలుగా జీతాలు అందటం లేదన్నారు. ఉపాధ్యాయులు, మెడికల్ డిపార్ట్‌మెంట్ నుంచి సంతోష్, స్వరూప, వీరాలాల్ తదితరులు ఉన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయండి..

పాల్వంచ: ఈనెల 29న మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరగనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కిలారు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పాత పాల్వంచలోని వనమా స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.. అని ఆనాడు కేసీఆర్ నినదించి పోరాడి సాధించారన్నారు. కార్యక్రమంలో వనమా రాఘవేందర్‌రావు, మండల అధ్యక్షుడు పూసల విశ్వనాథం, మల్లెల శ్రీరామ్మూర్తి, కాంపెల్లి కనకేష్, నాయుడు, మల్లెల రవిచంద్ర, దాసరి నాగేశ్వరరావు, కనగాల బాలకృష్ణ, పోలెబోయిన వీర్రాజు, ఏనుగుల శ్రీను, నామా నవీన్, వీరన్న, సింధు తపస్వీ, భట్టు మంజుల, శ్రీను, గోపాల కృష్ణ, సమ్మయ్య, విజయ్, రామారావు, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి


సమీక్షలో ఏటీడీఓ రాధ

ఇల్లెందురూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఏటీడీఓ సూర్నపాక రాధ సూచించారు. మండలంలోని ఏటీడీఓ కార్యాలయంలో ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీరోజు స్టోర్ రూంలను శుభ్రం చేయడంతోపాటు వంటకు నాణ్యమైన బియ్యం, కూరగాయలు వినియోగించేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలతో విద్యార్థులకు వంటను సిద్ధం చేసి పరిశుభ్రమైన ప్రదేశాలలో మాత్రమే భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల ఆవరణలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే పాఠశాల వైద్య సిబ్బంది చేత పరీక్షలు చేయించాలని, అవసరమైతే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి తరలించాలన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రణాళికా బద్ధంగా విద్యార్థులను సిద్ధం చేయాలని చెప్పారు. ఆయా విషయాలలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'పోటు' మృతికి పలువురి సంతాపం

జూలూరుపాడు: సీపీఐ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మృతికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, నాయకులు సంతాపం తెలిపారు. బుధవారం జూలూరుపాడులో సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో ప్రసాద్ మృతికి నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రసాద్ మృతి పార్టీకి పూడ్చలేని లోటన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. సంతాపం తెలిపిన వారిలో ఆ పార్టీ నాయకులు ఎస్కే నాగుల్‌మీరా, యల్లంకి మధు, ఎస్కే చాంద్‌పాషా, గార్లపాటి వీరభద్రం, వల్లమల్ల సామేలు, గార్లపాటి శివకృష్ణ ఉన్నారు.

టేకులపల్లి: సీపీఐ ఖమ్మం జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శి పోటు ప్రసాద్ మరణం పార్టీకి లోటని సీపీఐ కొత్తగూడెం జిల్లా నాయకులు గుగులోత్ రాంచందర్ నాయక్ అన్నారు. బుధవారం టేకులపల్లిలోని సీపీఐ కార్యాలయంలో సంతాప సభలో మాట్లాడారు. ఎజ్జు భాస్కర్, గుగులోత్ శ్రీను, వాసం భద్రయ్య, భానోత్ వీరన్న, అయితశ్రీరాములు, కిర్లపూడి సుందర్ పాల్, సతీష్, లక్ష్మణ్, రవీందర్, మధు, సోనీ పాల్గొన్నారు.

జూలూరుపాడు: కాకర్ల గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు గుండా సత్యనారాయణ తండ్రి సీతారాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం దశదిన కర్మ కార్యక్రమానికి పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు హాజరయ్యారు. సీతారాములు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సంతాపం తెలిపిన వారిలో చీమలపాటి భిక్షం, అల్లాడి నరసింహారావు, యల్లంకి చిన్న నాగేశ్వరరావు, నర్వనేని పుల్లారావు, వేల్పుల నరసింహారావు, కొలిపాక వెంకటేశ్వర్లు, ధరావత్ రాంబాబు, రోకటి సురేష్, పాపిన్ని జనార్ధన్, రాంశెట్టి నాగేశ్వరరావు, వందనపు సత్యనారాయణ, దాసరి నాగయ్య, బానోత్ ధర్మా, వై.గోపాల్‌రావు, రాయల సిద్ధు, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, చావా వెంకటరామారావు, జర్నలిస్టులు ఉన్నారు.

లైసెన్స్ లేకుంటే కఠిన చర్యలు


బొమ్మనపల్లిలో గ్రామీణ వైద్యుడి వద్ద తనిఖీ చేస్తున్న అధికారి సంపత్‌కుమార్

టేకులపల్లి: అనుమతులు, లైసెన్స్‌లు లేకుండా అల్లోపతి మందులను నిల్వ ఉంచి, విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఔషధ తనిఖీ అధికారి సీహెచ్ సంపత్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు జి.రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు కొత్తగూడెం జిల్లా ఔషధ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడి వద్ద లైసెన్స్ లేకుండా నిల్వ ఉంచిన రూ.15వేల విలువైన 25 రకాల మందులను స్వాధీనం చేసుకుని కోర్టులో ప్రవేశ పెట్టినట్లు అధికారి తెలిపారు. అనుమతులు లేకుండా మందుల విక్రయం నేరమని, లైసెన్స్ లేకుండా మందులు విక్రయించరాదని, నిబంధనలు ఉల్లంఘించినచో డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు.

ఆర్టీసీలో వన మహోత్సవం


సహపంక్తి భోజనాలు చేస్తున్న దృశ్యం

ఇల్లెందు: కార్తీక మాసం సందర్భంగా ఇల్లెందు ఆర్టీసీ డిపోలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఆర్టీసీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులతో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆటపాటలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం సరిరాం, డిప్యూటీ రీజినల్ మేనేజర్ పవిత్ర మాట్లాడుతూ.. ప్రతీ ఉద్యోగి ఆర్టీసీని తన సొంత సంస్థగా భావించాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, సంస్థ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎం దేవేందర్‌గౌడ్, అకౌంట్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు, ఈడబ్ల్యూటీ సభ్యులు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.